ప్రజాశక్తి
www.prajasakti.com
ఆదివారం 21 జనవరి 2024
5
వైఎస్ఆర్

కదలికలపై నిఘా ఉంచాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కడప అర్బన్

మాట్లాడుతున్న ఎస్‌పి

రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో నిఘా ముమ్మరం చేయాలని, ట్రబుల్ మాంగర్లు, చెడు నడత కలిగిన వారి కదలికలపై నిఘా ఉంచాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారం భించి వారికి దిశానిర్దేశం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి ఎప్పటికప్పుడూ సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు కె.అశోక్ రెడ్డి, జి.రాజు, జిల్లాలోని ఎస్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు



రాస్తారోకో

- అల్లాహ్, యేసు, ఈశ్వరుడికి ప్రత్యేక ప్రార్ధనలు
- 40వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. వై ఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహాశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. 40 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రధాన కూడళ్ల వరకు ర్యాలీ చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. మరికొన్ని ప్రాంతాల్లో సిఎం జగన్‌కు తమకు వేతనాలు పెంచేలా మంచి బుద్ధినివ్వాలని అల్లాహ్, యేసు, ఈశ్వరుడికి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీ నవల చేయాలని నిర్వహిస్తున్న సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా మహావీర్ సర్కిల్ వద్ద రాస్తారోకో చేపట్టారు. వివిధ ప్రజా సంఘాల, సిఐటియు, ఎఐటియుసి, రైతు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అంగన్వాడీల సమ్మె డిమాండ్లు వారి యూనియన్‌లతో పిలిచి చర్చించి పరిష్కరించకుండా సమ్మె అణిచి వేయడానికి, ఎస్మా చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆర్డర్ ద్వారా, జీ.వో నంబర్ 2 విడుదల చేసిందని పేర్కొన్నారు. 2024 లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు రాబోతున్నాయని , వైసిపికి ఆ మార్పు కనువిప్పు చేస్తుందని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం భౌతికమైనది దాన్ని విస్మరించే ప్రభుత్వాలకు నిష్క్రమణ తప్పదు అన్నారు. జగన్ పాలనలో సంక్షేమ పథకాలు పేరు గొప్ప ఊరు దిబ్బలాగా మారాయని, పథకాల పేర్లు మార్చడంలో ఉన్న ఆసక్తి , శ్రద్ధ ఆ పథకాలకు నిధులు మంజూరు చేయడంలో కనిపించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, నాయకులు రామమోహన్, చంద్రారెడ్డి, ఎఐటియుసి నాయకులు బాదుల్లా, వృద్ధిరేటు, భ్యాగ్యలక్ష్మి, అంగన్వాడీ నాయకులు అంజనీ దేవి,వసుంధర, మెర్సీ, ప్రసన్న, అభిబ్, పద్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, గుర్రప్ప, నాయకులు ఉదయ్, అంగన్వాడీలు పాల్గొన్నారు. **మైదుకూరు :** 40 రోజులుగా అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్తంగ సమ్మె నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మూడు రోజులుగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద 15 మంది అంగన్వాడి సంఘాల రాష్ట్ర నాయకులు ఆమరణ నిరాహార దీక్షను చేస్తున్నారు. శనివారం మైదుకూరు పట్టణంలో అంగ న్వాడీ నాయకులు రాయల్ సర్కిల్‌లో రాస్తారోకో కార్యక్ర మాన్ని నిర్వహించారు. ముం దుగా దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా బయ లుదేరి రాయల్ సర్కిల్ చేరుకుని రోడ్డుపైన బైఠాం ఇంచారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి జి.శివకుమార్, ఎఐటియుసి నాయకులు శ్రీరాములు, శివరాం, సిపిఎం. మండల కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పోయేకాలం దాపురించిందని 40 రోజులుగా సమ్మె చేస్తున్నా నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. అంగన్వాడీ డిమాండ్ల పట్ల సానుకూలంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం ఏమాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదని, లోలోపల అంగన్వాడీల ఉద్యోగాలకు ఎసరు పెట్టే ప్రయత్నాలు చేస్తుందని, అదే జరిగితే రాష్ట్రం అగ్ని గుండం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, సిఐటియు నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ కుమార్, డివై ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, యూనియన్ నాయకురాలు చెన్నమ్మ, ధనలక్ష్మి, భారతి, లక్ష్మి, రిజ్వాన, రామ తులసి, రాధా, వరలక్ష్మి, అనురాధ అన్నపూర్ణ, శివమణి, రమాదేవి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె 40వ రోజుకు చేరుకుంది. అల్లాహ్ ను, యేసును, ఈశ్వరుని సర్వ సమ్మేళనంగా ఉండే అంగన్వాడీలు ప్రార్థి స్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ మొర ఆలకించి వేతనాలు పెం చేలా జగన న్నకు మంచి బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బొజ్జ చిన్నయ్య, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు మేరీ, వినోద, మహాజ్యోతిమ్మ, రేణుక, సుదా, స్వాతి రమాదేవి, శ్రీదేవి, 250 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు 40 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టున్నప్పటికీ వారిపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని సమ యం వచ్చినప్పుడు గుణపాఠం చెప్తారని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్య నారాయణ అన్నారు. విజయవాడలో అంగన్వాడీలు చేస్తున్న ఆమరణ నిరా హారదీక్షలకు మద్దతుగా స్థానిక శివాలయం సర్కిల్‌లో అంగన్వాడీలు సిఐటియు, ఏఐటియుసి ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చి అనంతరం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో అంగ న్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మిదేవి, రాజీ, సువార్తమ్మ, రాణి, సుబ్బలక్ష్మి, విజయ, గురుదేవి, శివమ్మ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో సర్వమత ప్రార్థనలు నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

వైఎస్ఆర్ ఘాట్ వద్ద తండ్రి సమాధికి నివాళులర్పిస్తున్న వై.ఎస్. షర్మిల

ప్రజాశక్తి - వేంపల్లె

అహ్మదుల్లాకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. పిసిసి అధ్య క్షులుగా బాధ్యతలు స్వీకరించే ముందు శనివారం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్ఆర్ సమాధి వద్ద మాజీ నివాళులర్పించారు. వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిసిసి ఛీఫ్‌గా బాధ్యతలు స్వీకరించే ముందు నాన్న ఆశీర్వాదం కోసం ఇడుపులపాయకు వచ్చినట్లు చెప్పారు. వైఎస్ఆర్ అడుగు జాడల్లో నడించేందుకు కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు అంటే ప్రాణంతో సమానమన్నారు. కాంగ్రెసు పార్టీ సిద్ధాంతాల కోసం వైఎస్ఆర్ ఎంత దూరమైన వెళ్లే వారని చెప్పారు. వైఎస్సార్ నమ్మిన సిద్ధాంతం కోసం నేను కాంగ్రెస్ పార్టీలో ఆఖరి వరకు నిలబడతానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, ఎఐసిసి సభ్యులు రఘువీరారెడ్డి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, పిసిసి మాజీ అధ్యక్షులు శైలజానాథ్, మాజీ మంత్రి అహమ్మదుల్లా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి అహ్మదుల్లా

మాజీ మంత్రి అహమ్మదుల్లా షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఆమె కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి అహమ్మదుల్లా కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మాజీ పిసిసి రఘువీరారెడ్డి, శైలజానాథ్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్ర రావు మాట్లాడుతూ ఎపిలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ పురుడు పోసుకోవాలనే ఉద్దేశంతో పిసిసి చీఫ్‌గా వైఎస్ఆర్ కుమార్తె షర్మిలను కాంగ్రెస్ అధిష్టా‘నం నియమించినట్లు చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రెండు సార్లు అధికారంలోకి వచ్చేందుకు వైఎస్ఆర్ దోహద పడినట్లు చెప్పారు. మళ్లీ అటువంటి బాధ్యత షర్మిల తీసుకుందని చెప్పారు. మనస్ఫూర్తిగా షర్మిలకు మద్దతు ఇస్తామని చెప్పారు. కేంద్రానికి కొన్ని పార్టీలు బానిస అయ్యాయని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టతామని చెప్పారు. ఎర్రకోట మీద రాహుల్ గాంధీ ప్రధానిగా జాతీయ జెండాను ఎగుర వేయాలనే లక్ష్యంతో కలిసి కట్టుగా పని చేస్తామని చెప్పారు. మాజీ మంత్రి అహమ్మదుల్లా మొట్టమొదటి సారిగా షర్మిల చేతుల మీదుగా కండువా వేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందుకు కడప నుండి భారీ క్యానయ్‌తో షర్మిల ఇడుపులపాయకు చేరుకున్నారు. కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు ఇడుపులపాయకు తరలి రావడంతో ఇడుపులపాయ కిటకిటలాడింది. వైఎస్ఆర్ సమాధికి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అల్లాబకష్, అనంతపురం జిల్లా అధ్యక్షులు బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, నగర మైనార్టీ అధ్యక్షుడు దాదాగాంధీ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ షానవాజ్ (కదిరి), రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాలాజీ మనోహర్, రైల్వేకోడూరు గౌసులాదేవి, మాజీ ఎమ్మెల్యే కమలమ్మలతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప ఎయిర్ పోర్టులో షర్మిలకు ఘన స్వాగతం

కడప : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల శనివారం సాయంత్రం కడపకు చేరుకున్నారు. ఆమెకు కడప విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. ప్రత్యేక విమానంలో షర్మిలతో పాటు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు రఘువీరారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి, జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు ఆధ్వర్యంలో గజమాలతో క్రేన్ సాయంతో స్వాగతం పలికారు. దాదాపు 200 వాహనాల్లో కడప విమానాశ్రయం వద్ద నుంచి పెండ్లిమర్రి మీదుగా వేంపల్లెకు ర్యాలీగా చేరుకున్నారు. వేంపల్లిలో బాణాసంచా పేల్చి స్వాగతం పలికారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, జకరయ్య, ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తారు, కడప నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు ప్రతాపరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అల్లా బకాష్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, నంద్యాల జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్, విష్ణు ప్రితమ్ రెడ్డి, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, పూల నజీర్, శర్మ, అమర్నాథరెడ్డి, ధ్రువ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

బిఇడి కళాశాలలపై చర్యలకు జాప్యమేలా? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ సిడిసికి వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బిఇడి కళాశాలలపై యునివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ప్రశ్నిం చారు. శనివారం నిభందనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వైవీయూ సిడిసి రఘు బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో చాలా వరకు కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నా యుని వర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. యథేచ్ఛగా అంగట్లో సరుకులు లాగా వేల రూపాయలకు ఇతర రాష్ట్రాల నుంచి అడ్మిషన్లు చేర్చుకుంటూ అక్రమ మార్గాలలో నడుపుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఉపాధ్యాయులు, వినడానికి తరగతి గదులలో విద్యార్థులు ఉండరని చెప్పారు. కేవలం భవనాలు మాత్రమే ఉంటాయని, అవీ పాడు పడిన బంగ్లాళా దర్శనమిస్తామని పేర్కొన్నారు. ల్యాబ్ సౌకర్యాలు ఉండవన్నారు. ఇంత బహిరంగంగా నిబంధనలు పాటించకుండా నడుస్తున్నా యుని వర్సిటీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్య మేమిటన్నారు. కమిటీ వేసి తనిఖీలు నిర్వహించి తుతూ మంత్రంగా కాకుండా పక్కగా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకుడు సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

‘రా.. కదలిరాకు నీరాజనం’

ప్రజాశక్తి - కడప



‘పుత్తా’ను సన్మానిస్తున్న వికాస్ హరికృష్ణ

కమలాపురంలో ఈనెల 19న నిర్వహించిన ‘రా....కదలిరా’ భారీ బహిరంగ సభ విజయ వంతమైందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రా.. కదిలిరా.. సభను విజయవంతం చేసినందుకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ పుత్త నరసింహారెడ్డికి శనివారం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ దుపట్టాతో సత్కరించారు. బహిరంగ సభ విజయవంతానికి సహకరించిన అన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు ధన్యవాదాలు తెలియజేశారు. చంద్రబాబు రా....కదలిరా.. పిలుపున కు ప్రజలు స్వచ్ఛందంగా కదిలి వచ్చారని ఇది ప్రజలలో కలిగిన మార్పుకు నిదర్శనమని అన్నారు. సభ విజయవంతం చేసిన జిల్లా ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, నందమూరి అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో 22 డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవా రంగాల్లో లోపాలకు సత్వర న్యాయం

- శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్

ప్రజాశక్తి - కడప

సేవా రంగాలలో లోపాలకు సత్వర న్యాయం లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చునని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ అన్నారు. శనివారం ఉదయం యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన పరిపాలన భవనంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాలులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహిoచారు. వైవీయూ లీగల్ సెల్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.వి. జయంత్ కశ్యప్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఎస్. రఘునాథ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా శాశ్వత లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా ప్రతి పౌరుడూ న్యాయం పొందే హక్కు కల్పించిందన్నారు. అందులో భాగంగా అవసరమైన ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందని ఇక్కడ లభించే తీర్పు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమానమని అన్నారు. తీర్పు వెలువడ్డాక పై కోర్టుకు అప్పీల్ అనేది ఉండదని స్పష్టం చేశారు. రూ. కోటి విలువ గల వివాదాలు ఇక్కడ ప్రజాప్రయోజిత సేవ రంగాలకు సంబంధించి రవాణా, సమాచార, విద్యుత్, నీటి సరఫరా, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ ప్రజా సేవలు, ప్రజారోగ్యం, బీమా సౌకర్యాలు, విద్యాసంస్థలు, స్థిరాస్తి వ్యాపారం, ఉపాధి హామీ, బ్యాంకుల సేవా లోపాలు ఎదురైనప్పుడు పర్మనెంట్ లోక్ అదాలత్ సత్వర సేవలు పొందవచ్చు అన్నారు. 90 రోజుల్లో పై వెలువడి బాధితులకు స్వాంతన కలిగిస్తామని గతంలో వెలువడిన తీర్పులను ఉదహరిస్తూ అవగాహన కల్పించారు. ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. సమస్య ఎదురైనప్పుడు ఆందోళన చెందకుండా న్యాయస్థానాలను ఆశ్రయించాలంటే చట్టాల పట్ల అవగాహన పొందాలన్నారు. ఇలాంటి వేదికలు దోహదపడతాయన్నారు. అనంతరం న్యాయపరమైన సందేహాలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా న్యాయపరంగా సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, లీగల్ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ వి జయంత్ కశ్యప్, లోక్ అదాలత్ సయ్యద్ సాహెబ్, అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చట్టాల పట్ల అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం కడప నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, లింగ సున్నితత్వం మొదలగు అంశాలపై సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి, లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల నివారణ, పరిష్కారానికి, దానికి సంబంధించిన విషయాల కోసం చట్టం, మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైనప్పుడు పోష్ చట్టం 2013 కింద ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. బాధిత మహిళలకు గరిష్టంగా మూడు నెలల వరకు సెలవు మంజూరు, సమాన హక్కులు, 509 ఐపిసి గురించి వివరిం చారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి జి. రంగస్వామి, దిశ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, బార్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్, సుబాన్, వన్ స్టాఫ్ సెంటర్ ఎఒ అశ్వని, ఆఫీసర్ భాస్కర్, డిస్టిక్ పంచాయతీ ఆఫీసర్, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, పారా లీగల్ వాలం టరీలు, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్ అమలు మరిచారు

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి దాన్ని అమలను విస్మరించిందని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతికి ఉద్యోగ, ఉపాధ్యాయులు 12వ పిఆర్‌సికి సంబంధించిన మధ్యంతర భృతి ప్రకటిస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశారని తెలిపారు. ప్రభుత్వం కేవలం కమిషన్ వేసి చేతులు దులుపుకోవడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనగా, ఆవేదనగా ఉన్నారన్నారు. కమిషన్‌కు ఇంత వరకు సిబ్బందిని కూడా నియమించలేదని పేర్కొన్నారు. విద్యాసంవత్సరం పూర్తి కావస్తున్నా పాఠశాల నిర్వహణ గ్రాంట్లు వంద శాతం కానీ నాడు-నేడుకు నిధులు చెల్లించక పోవడం, ఉద్యోగులకు రావాల్సిన ఎపిజిఎల్ఐ, పిఆర్‌సి, డిఎ బకాయిలు, సరెండర్ లీవ్, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా అయినా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.రామ మోహన్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ టి.రవిశంకర్ రెడ్డి,రాజేంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల అభ్యంతరాలపై వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్



ఆర్‌డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హెడ్ నర్సస్ నుంచి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ - 2 ఉద్యోగోన్నతులపై కర్నూలు జిల్లా అధ్యక్షులు వెంగల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరిరెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు , జిల్లా కార్యదర్శి డి.రవి కుమార్, నాయకులు కాసన్న అభ్యంతరాలు వ్యక్తం చేశారు. శనివారం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్న కుమారిని కలిసి సీనియర్టీపై అభ్యంతరాలపై విన్నవించారు. కౌన్సెలింగ్‌లలో పోస్టు యాడ్ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్‌డి అభ్యంతరాలను పరిశీలించి సరి చేస్తామని చెప్పారు.

చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుమారుడు రితీష్ రెడ్డి తీసుకుంటున్న వ్యతిరేక విధానాలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని మండల తెలుగుదేశం నాయకులు చెరుకూరు రవి, కర్నాటి వెంకటరెడ్డి, ఓబుళాపురం రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఎన్నో ఏళ్ల నుంచి కష్టనష్టాలను ఓర్చుకుని తెలుగుదేశం కోసం తాము పనిచేస్తున్నామని చెప్పారు. విజయమ్మ కుమారుడు రితీష్ కుమార్ రెడ్డి వచ్చిన తర్వాత సీనియర్లు ఎవరైనా సరే తన మాట వినకపోతే వారిని దూరం పెడుతూ భౌతిక దాడి చేస్తూ కేసులను పెడుతూ ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడును కలిసి బద్వేల్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు నాయకులకు జరుగుతున్న ఇబ్బందులు తెలియజేసి పార్టీని నాయకులను కార్యకర్తలకు న్యాయం చేయాలని కాపాడాలని కోరుతామని నియోజక వర్గ మండల నాయకులు తెలిపారు. సమావేశంలో బద్వేల్ మాజీ జడ్‌పిటిసి శిరీష, కలసపాడు మండల నాయకుడు బాలిరెడ్డి, బద్వేల్ పట్టణ నాయకుడు భీరం సుబ్బారెడ్డి , ప్రహల్లాదా రెడ్డి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కర్నాటి వెంకటరెడ్డి

జగన్‌కు పరాభవం తప్పదు : టిడిపి

కడప అర్బన్ : రాష్ట్రంలో జరగబోవు ఎన్నికల్లో జగన్‌కు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఘోర పరాభవం తప్పదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని 41 డివిజన్ ఇన్‌ఛార్జి కర్నాటి ఓబుల్ రెడ్డి కర్నాటి చంద్రబాబురెడ్డి ఆధ్వర్యంలో యువకులు, మహిళలు పెద్ద ఎత్తున టిడిపిలోకి చేశారు. వారికి శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డప్ప గారి మాధవి పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒక్కఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్, ప్రజా వ్యతిరేక పాలన కొనసాగించి, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారని చెప్పారు. మాధవి మాట్లాడుతూ జగన్ సొంత గడ్డ కడప జిల్లాలో టిడిపి జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ చేరికలు పార్టీకి మరింత బలం చేకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, బి, శ్రీధర్, సుధాకర్ యాదవ్, స్థానిక నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

‘ఒబిసి సెల్’ వెబ్‌సైట్ బ్రోచర్ ఆవిష్కరణ

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఇతర వెనుబడిన తరగతుల (ఒబిసి) విభాగం వెబ్‌సైట్ బ్రోచర్‌ను విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రర్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ్ రెడ్డితో కలసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైవీయూ ఒబిసి సెల్ డైరెక్టర్ డాక్టర్ కె. ఎస్. వి. కృష్ణారావు, సభ్యులు డాక్టర్ బి. గంగయ్య, డాక్టర్ జి.పార్వతి, ఎం. సరళ ఆధ్వర్యంలో పని చేస్తుందని తెలిపారు. ఒబిసి విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ రిజర్వేషన్, లక్ష్యసాదనకు అవసరమైన మార్గాలను ఈ విభాగం సూచిస్తుందన్నారు. అలానే ఒబిసి విద్యార్థుల సమాచారం సేకరించి నివేదికలు సిద్ధం చేసి కేంద్ర మంత్రిత్వ శాఖకు పంపే బాధ్యతను చూస్తుందన్నారు.

రాజకీయ వేడి

ప్రజాదృష్టి

జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ప్రతిపక్ష టిడిపి అంగన్వాడీల నిరసనలు, దీక్షలను సొమ్ము చేసుకునే పనిలో పడింది. సంఘీభావం తెలపడానికి పోటీ పడుతుండడం గమనార్హం. ప్రజలు, అంగన్వాడీలు, ఆశాల్లో నెలకొన్న అసమ్మతిని సొమ్ము చేసుకునే పనిలో నిమగ్నమైంది. ఉమ్మడి కడప జిల్లాలో అధికార వైసిపి సిట్టింగుల్లో రాజంపేట సమన్వకర్తను మినహా మిగిలిన వారందరికీ టికెట్లపై భరోసా ఇచ్చినట్లు కనిపిస్తోంది. ప్రతిపక్ష టిడిపిలో టికెట్లపై భరోసా లభించకపోవడంతో అస్పష్టత నెలకొంది. ప్రతిపక్ష టిడిపి ఆశావహుల్లో గందరగోళం నెలకొంది. ఇటువంటి వాతావరణంలో ప్రతిపక్ష టిడిపి, సిఎం వైఎస్ జగన్ సొంత జిల్లాలో బలమైన అధికార వైసిపిని ఢీకొనడం ఆషామాషీ వ్యవహారం కాదనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి సమయంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు తాజాగా కమలాపురం నియోజకవర్గ పర్యటనలో టికెట్ల పట్ల స్పష్టత లభిస్తుందని ఆశించిన ఆశావహుల్లో నిరాశ అలుముకుంది. కడప టికెట్ పట్ల స్పష్టత ఇవ్వడం లభించింది. వైసిపి తరుపున రాజంపేట, టిడిపి కడప టికెట పట్ల స్పష్టత ఇవ్వడం మినహా చేసినదేమీ లేదనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రాజకీయాలకు తెరలేచింది. కడపలో టిడిపి అభ్యర్థి ఎన్నికల రథాలతో పోరును పతాకస్థాయికి చేర్చింది. రాజంపేట, మదనపల్లెలో అధికార వైసిపి సమన్వయకర్తలను నియమించడంతో టికెట్ స్పష్టత లభించడంతో రాజకీయం ఊపందుకుంది. ఉమ్మడి జిల్లాలోని మిగిలిన పులివెందుల మినహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలకు స్పష్టత లభించే అవకాశం సమీపించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయం ఊపందుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాజకీయ అగ్రనాయకత్వం వరుస పర్యటనలు కేడర్‌ను ఉత్సాహపరుస్తోంది. టిడిపి టికెట్ల కేటాయింపుల్లో తప్పిదాలతో పాల్పడకపోతే ఎన్నికలు హోరాహోరీగా నడిచే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. కడప, రాజంపేట ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించడమే ఆలస్యమని తెలుస్తోంది. ఇప్పటికే వైసిపి సిట్టింగ్ ఎంపీలు ఆయా కార్యక్రమాల పేర్లతో పర్యటించడం మొదలైంది. ప్రతిపక్ష టిడిపి అభ్యర్థులు మాత్రం ఎన్నికల ప్రచారం చేపట్టడం లేదు. ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల్లో గెలుపు పట్ల భరోసా కొరవడిన నేపథ్యమే కారణమని తెలుస్తోంది. ఏదేమైనా అధికార, ప్రతిపక్ష అభ్యర్థులకు అంగన్వాడీల పోరాటం అనుభవైద్యేకం చేయడంలో అంగన్వాడీలు కృతకృత్యులయ్యారని చెప్పడంలో సందేహం లేదు. ఇటు వంటి సుదీర్ఘ పోరాటం సమీప భవిష్యత్‌లో ఫలించడం ఖాయమని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పార్టీలో చేరినవారితో భూపేష్‌రెడ్డి

పార్టీ గెలుపులో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపిలో చేరిన ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపులో భాగస్వాముల వ్వాలని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బ రామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పెద్దముడియం మండలం భీమగుండం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా భూపేష్ సుబ్బారామిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు సైనికుల్లా పనిచేసే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, వేయించి తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారిలో పుల్లారెడ్డి, పార్థసారధి రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటరమణ, రాజు ఉన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక న్యాయంపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్.తులసిరెడ్డి

సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి లేదని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దెయ్యాలు వేదాలు వల్లించినట్లు, గాడ్సే అహింస గురించి మాట్లాడినట్లు జగన్ వాలకం ఉందన్నారు. ఎస్టీ, ఎస్సీ సబ్ ప్లాన్‌కు తిలోదకాలి చ్చారన్నారు. ఎస్టీ, ఎస్సీ కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయక నిర్వీర్యం చేశారని విమర్శించారు. కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయినట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వం ఎస్సీల మీదనే ఎస్సీ చట్టాన్ని ఉపయోగించినట్లు చెప్పారు. దళిత డ్రైవర్ సుబ్బయ్యను వైసిపి నేతలు హత్య చేసి డోర్ డెలివరీ చేశారన్నారు. విశాఖలో డాక్టర్ సుధాకర్, కడపలో డాక్టర్ అచ్చెన్న ప్రభుత్వ వేధింపులవల్ల చనిపోయినట్లు చెప్పారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ఎస్టీ, ఎస్సీ సబ్ ప్లాన్‌కు చట్ట భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయాలని తులసిరెడ్డి కోరారు.

గెలుపొందిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్

గెలిచిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ ఆటలో గెలిచిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల ప్రిన్సిపల్ హనుమంత్‌రావు అభినందించారు. శనివారం స్థానిక బాలికల కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా ముద్దనూరు రోడ్డు సచివాలయం తరుపున ఆడి తమ కళాశాల విద్యార్థులు మండలస్థాయిలో గెలుపొంది తాలూకా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్

కులగణనతో వెనుకబడిన వర్గాలకు మేలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే వల్ల వెనుకబడిన వర్గాలకు మేలు జరుగుతుందని మునిసిపల్ కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, 15వ వార్డు కౌన్సిలర్ పురుషోత్తం అన్నారు. శనివారం పట్టణంలో జరుగుతున్న కులగణన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కులాల వారీగా జనగణన చేసి ఖచ్చితమైన కుల జనాభాను నిర్ణయించి కులాల వారీగా ప్రభుత్వం నుంచి వారికి రావలసిన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లునిర్దేశించిన మేరకు ప్రజలకు అందివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి వాలంటీర్ గడపగడపకూ వెళ్లి విధిగా ఖచ్చితమైన వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రెటరీ నాగలింగం, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు తగవు

- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహిళలపై లైంగిక వేధింపులు తగదని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. స్థానిక కోరులో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు పిఓఎస్‌హెచ్-2013 చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగస్తులను సహచర ఉద్యోగులు అవమానకరంగా మాట్లాడినా, లైంగికంగా వేధించినా పైపేర్కొన్న చట్టం ప్రకారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఫిర్యాదు మేరకు వారిపై చర్యలు తీసుకొని న్యాయపరంగా శిక్ష విధించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని సూచించారు. జమ్మలమడుగులో పనిచేసే మహిళా ఉద్యోగులు 08560-270811, 08560-270003 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చున్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎపిఎస్ ఆర్‌టిసి కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జడ్జి భార్గవి

తుంపర సేద్యం.. లాభదాయకం

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు - ఆరుతడి పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంపై రైతుల్లో ఆసక్తి

స్ప్రింక్లర్స్‌తో పంటను తడుపుతున్న రైతు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయం చేయడం, తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకునేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే ఆకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యం డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొచ్చు. డ్రిప్ విధానంలో పంటలోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క నీరు మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింక్లర్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందించడం జరుగుతుంది.

తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపులు కొనుగోలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.5,600 వరకు ఖర్చవుతుంది. రెండు ఎకరాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, మూడు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు, నాలుగు ఎకరాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలు ఉంటాయి. అయితే రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరం లేకుండా పంటలకు నీటిని అందించవచ్చు. స్ప్రింక్లర్లలో ఇంపాక్ట్ స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్స్, పార్ట్ సర్కిల్ స్ప్రింక్లర్స్, పర్‌ఫోరేటెడ్ పైపులు, జెట్ స్ప్రింక్లర్స్, పాపప్ స్ప్రింకర్స్, రెగ్యులేటెడ్ స్ప్రింక్లర్స్ తదితర రకాలు ఉంటాయి. వీటి వాడకం వల్ల నీరు కూడా తక్కువగా పడుతుంది. తద్వారా తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చును. కాబట్టి రైతులు ఈ పద్ధతిని అనుసరించడం లాభదాయకం.

'రోడ్డు విస్తరణ నిధుల సమాచారం ఇవ్వాలి'

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో పులివెందుల-గండి-కడప రోడ్డులోని విస్తరణ పనుల నిధుల వివరాలకు సంబంధించి అధికారులు సమాచారం ఇవ్వాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ కోరారు. శనివారం పులివెందులలోని రోడ్డు భవనాల శాఖ ఇఇ కార్యాలయంలో సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలని టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు మరమ్మతుల్లో ఇంటి నిర్మాణాలకు ఇంటిని కటింగ్ చేసి వేస్ట్ మట్టిని తరలించేందుకు రూ.1.30 కోట్లతో ప్రభుత్వం టెండర్ వేసిందన్నారు. దీంతో వేంపల్లెకు చెందిన వైసిపి నాయకుడు ఆ టెండర్‌ను దక్కించుకున్నారని తెలిపారు. అయితే అధికారులతో టెండర్ వేసిన వ్యక్తి కుమ్మక్కై ఆ వేస్ట్ మట్టిని తరలించలేదని తెలిపారు. టెండర్ దక్కించుకొన్న వ్యక్తి మౌనంగా ఉండడంతో కడప-పులివెందుల-గండి రోడ్డులో ఉన్న ఇంటి యాజమానులే ఇళ్లను పగుల గొట్టుకొని మరమ్మతులు చేసుకోవడంతోపాటు వేస్ట్ మట్టిని సొంత డబ్బుతో ఎత్తి వేయించడం జరిగిందని చెప్పారు. నిబంధనలు మేరకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆ మట్టిని తొలగించాల్సి ఉందన్నారు. అలాంటి పనులు చేయకుండానే నిధులు డ్రా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఆ మట్టి తొలగించేందుకు ఇంటి యజమానులకు వేలాది రూపాయలు ఖర్చు అయ్యిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి నాయకుడు రామాంజనేయురెడ్డి (చంటి), మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్ ఉన్నారు.

వినతి పత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

పోలీసుల తనిఖీ వెనుక ఎమ్మెల్యే హస్తం

మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో పోలీసుల తనిఖీ వెనక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఉన్నారంటూ టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిబి రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేనే పట్టిస్తారు, ఆయనే సాను భూతి తెలిపేందుకు వెళ్లి ధర్నాలు చేస్తారంటూ వ్యాఖ్యానించారు. లక్షలకు లక్షలు దానధర్మాలు చేస్తున్న ఎమ్మెల్యే వాహనాన్ని పోలీసులు ఎందు కు తనిఖీ చేయరో వెల్లడించాలని డిమాండ్ చేశారు. డబ్బుల కట్టలు పేర్చి పంచుతున్న సమయంలో డబ్బులు ఎక్కడివి అని పోలీసులు ప్రశ్నించరా అని నిలదీశారు. కరోనా సమయంలో వ్యాపారస్తుల నుండి ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేశారంటూ మరో ఆరోపణ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబివుల్లా, మండల టిడిపి అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, రాజుపాలెం మండలం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, తొమ్మిదో వార్డు కరీముల్లా, 14వ వార్డు గోలే పాల్గొన్నారు.

వైసిపి నేతలు టిడిపిలో చేరేందుకు సిద్ధం

- టిడిపి రాష్ట్ర నాయకులు సిఎం సురేష్ నాయుడు

చంద్రబాబు సభల్లోని ప్రజలను చూసి వైసిపి నాయకుల గుండెల్లో భయం మొదలై, టిడిపిలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర నాయకులు సీఎం సురేష్ నాయుడు అన్నారు. శనివారం స్థానిక అన్న క్యాంటీన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం కమలాపురంలో జరిగిన 'రా కదలి రా' కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ముందుగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. వేలాదిగా జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన జన సందోహాన్ని చూసి త్వరలో వైసిపికి చెందిన ముఖ్యనేతలు టిడిపిలో చేరబోతున్నారంటూ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఎన్నికల కోడ్ ప్రొద్దుటూరులో అమలవుతోందన్నారు. అనధికార నగదు అని సాధారణ ప్రజల సొమ్మును తనిఖీల పేరుతో సీజ్ చేయడం దారుణమన్నారు. ప్రస్తుత ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గతం మరిచి టిడిపి అధినేత చంద్రబాబును విమర్శించడం తగదన్నారు. గతంలో టిడిపిలో పని చేసిన రాచమల్లు ఆ రోజులు మరిచారా అంటూ గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విఎస్ ముక్తియార్, మాజీ మండల ప్రెసిడెంట్ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఆర్ఐటి కాలేజీ చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, 23, 24 వార్డు ఇన్‌ఛార్జి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్ బాషా, పలువురు ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతలో తాయెత్తులు అమ్ముకున్నట్లుంది

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కమలాపురంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రా..కదలిరా.. చంద్రబాబు సభ సంతలో తాయెత్తులను అమ్ముకున్నట్లుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మందు, బిర్యాని, రూ.500 నగదు ఇస్తామని చెప్పినా 30వేల మందికి మించి బాబు సభకు హాజరుకాలేదన్నారు. టిడిపి నాయకులు ఈ విషయంలో ఆత్మసాక్షిగా చెప్పాలన్నారు. చంద్రబాబు ప్రజానమ్మకం కోల్పోవడంతో ఈ దుస్థితి దాపురించిందన్నారు. తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్, నిరుద్యోగభృతి, మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం ఇవన్నీ చెబుతూ ఉంటే సంతలో తాయెత్తులు, మూలికలు అమ్ముకున్నట్లుందని విమర్శిం చారు. బాబు వల్లెవేసిన పథకాల్లో శాస్త్రీయతలేదన్నారు. 2014-19 కాలంలో రైతు రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు.

వ్యవసాయం దండగ.. ఉచిత కరెంటు బట్టలు ఆరేసుకోనా అని వ్యంగ్యంగా మాట్లాడిన బాబు మాటలు ప్రజలకు గుర్తున్నాయన్నారు. చంద్రబాబు రైతు ద్రోహి అయితే జగన్ రైతు పక్షపాతి అన్నారు. బాబు సంక్షేమం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. జగన్ పథకాలైన నాడు -నేడు, ఫించన్, అమ్మఒడి, నేతన్ననేస్తం తదితర పథ కాలతో లబ్ధి పొంది ఉంటే ఓటేసి ఈసారి మద్దతివ్వండని జగన్ ఓట్లడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాల ద్వారా రూ.2లక్షల 50వేల కోట్లు పేదలకు పంపిణీ చేయగా.. ఇందులో రూ.2లు కూడా అవినీతి జరగలేదని, ఇది పారదర్శకతకు నిదర్శనమన్నారు. తనపై చంద్రబాబు చేసిన అరోపణలకు 2024ఎన్నికలే సమాధానం చెబుతాయని రాచమల్లు అన్నారు.

జనరిక్ ఔషధ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరులోని డిసిసి బ్యాంక్ భవనాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ ఔషధ కేంద్రాన్ని శనివారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఆప్కో చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి కష్టాలు తీర్చరూ..!

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని దుంపలగట్టు చెరువు కట్టకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పొలాలకు వెళ్లలేని పరిస్థితి. కంపచెట్లు తొలగించి దారి కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నారు. దుంపలగట్టు గ్రామం నుంచి కట్ట మార్గం ద్వారా పొరుగు గ్రామం పాటిమీదిపల్లెకు ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. వెంటనే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.


చెరువు కట్ట వెంబడి ఏపుగా పెరిగిన కంపచెట్లు

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు నంద్యాల రోడ్డులోని పాతసంత వద్ద రూ.1.20 కోట్లతో 13 కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ భవనాలు నిర్మించనున్నారు. ఇందుకోసం శనివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరు అభివృద్ధి కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపి కాలనీలో శనివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు, సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వికెట్ కీపర్‌గా ప్రొద్దుటూరు విద్యార్థి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రశాంత్

ఈనెల 23 నుంచి గోవాలో జరగనున్న అంతర్‌రాష్ట్ర సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో రాష్ట్రం తరపున ప్రొద్దుటూరుకు చెందిన సి.వి.యస్.ప్రశాంత్ వికెట్ కీపర్‌గ ఎన్నికయ్యారు. ప్రశాంత్ స్థానిక రాఘవేంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థి. గుంటూరు జిల్లా పేరేచర్లలో జరిగిన జోనల్ మ్యాచ్‌లో మంచి ప్రతిభ కనబరచి రాష్ట్రజట్టులో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ వికెట్ కీపింగ్‌లో ధోనీ, బ్యాటింగ్‌లో విరాట్‌కోహ్లి తనకు ఆదర్శమన్నారు. గోవాలో జరగనున్న మ్యాచ్‌లలో మంచి ప్రతిభ కనబరుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. కోచ్ అహ్మద్ నేర్పిన మెళకువలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. కడప జిల్లా క్రికెట్ అసోషియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య అందుతోందని డిఇఒ రాఘవరెడ్డి అన్నారు. శనివారం తన ఛాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, నాడు-నేడు కార్యక్రమాలతో విద్యాశాఖ రూపురేఖలను మార్చారన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేశారన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారన్నారు. విద్యా బోధనలో మార్పులు తీసుకొచ్చి గుణాత్మక విద్యను అందజేస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తయారు చేయడం అభినందనీయమన్నారు. విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని భారీ ఎత్తున అన్ని రకాల హంగులతో ప్రతిష్టింపజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, జిల్లా కార్యదర్శులు గంగాధర్, మోహన్, రాజబాబు, శివ శంకర్, వెంకటేశ్వర్లు, దేవరాజు, విక్టర్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరిస్తున్న డిఇఒ, సంఘం నాయకులు

CHANGE OF NAME

I, **KATIKA REDDY MADHU SUDHANA REDDY** (Old Name Mentioned in Passport bearing No.P5275113), S/o K.Rama Subba Reddy, resident of D.No.2/ 69-A, Near Police Station Street, Muddanur Mandal of YSR Kadapa Dist,A.P.here by declare that I have Changed my name as **KATIKAREDDY MADHUSUDHAN REDDY** (New Name) For all purposes.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రొద్దుటూరు

O.S.No. 8/2023

కె. పుల్లారెడ్డి. ...వాది

Vs

1) కె. పార్వతమ్మ
2) కె. సుబ్బలక్షుమ్మ
3) కె. లక్ష్మిదేవి

...ప్రతివాదులు నెం.5, 9, 10

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా వాది కె.పుల్లారెడ్డి అనే అతను ప్రతివాదులు నెం.5, 9, 10 అయిన మీ పైన ఓ.యస్.నెం.8/2023 దావాను దావా ఆస్తిని భాగపరిష్కారం చేయుట కొరకు దాఖలు చేసినాడు. కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయటం ఏమనగా ప్రతివాదులు నెం.5, 9, 10 అయిన మీరు 25.01.2024వ తేదీన ఉదయం 10.30 నిమిషములకు మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్న యెడల స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ పై తెలిపిన కోర్టు యందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపవలెను. సదరు తేదీన ప్రతివాదులు నెం.5, 9, 10 అయిన మీరు హాజరు కాని యెడల రాజశ్రీ కోర్టువారు ప్రోసీజర్ ప్రకారం విచారణ చేపట్టి మీ పరోక్షమున తీర్మాణం ఓ.యస్.నెం.8/2023 తీర్మాణం చేయబడును.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

వి.సుబ్బారెడ్డి, యం.ఎ.,యం.యల్.,
అడ్వకేట్, కడప.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రొద్దుటూరు

I.A.No. 107/2023
In
O.S.No. 8/2023

కె. పుల్లారెడ్డి. ...పిటిషనర్/వాది

Vs

1) కె. పార్వతమ్మ
2) కె. సుబ్బలక్షుమ్మ
3) కె. లక్ష్మిదేవి

...ప్రతివాదులు నెం.5, 9, 10

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా వాది కె.పుల్లారెడ్డి అనే అతను ప్రతివాదులు నెం.5, 9, 10 అయిన మీ పైన ఐ.ఎ.నెం.107/2023 ఇన్ ఓ.యస్.నెం. 8/2023 నందు దావా ఆస్తులను దావా తీర్మాణం అయ్యేవరకు అమ్మకుండా నిరోధించుటకు ఇంజక్షన్ పిటిషన్ దాఖలు చేసినాడు. కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయటం ఏమనగా ప్రతివాదులు నెం.5, 9, 10 అయిన మీరు 25.01.2024వ తేదీన ఉదయం 10.30 నిమిషములకు మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్న యెడల స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ పై తెలిపిన కోర్టు యందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపవలెను. సదరు తేదీన ప్రతివాదులు నెం.5, 9, 10 అయిన మీరు హాజరు కాని యెడల రాజశ్రీ కోర్టువారు ప్రోసీజర్ ప్రకారం విచారణ చేపట్టి ఐ.ఎ.నెం.107/2023 మీ పరోక్షమున తీర్మాణం చేయబడును.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

వి.సుబ్బారెడ్డి, యం.ఎ.,యం.యల్.,
అడ్వకేట్, కడప.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KADAPA

E.P.No. 23/2022
O.S.No. 3/2016
(On the file of Senior Civil Judge, Proddatur)

Kusetty Ramudu, S/o Venkata Swamy, aged 40 years, Hindu, Business, R/at Door No.12/294-1-2,Kadapa Road, Mydukur Town and Mandal, Kadapa District. **...Petitioner/D.Hr.**

Vs

Kambala Bhaskar Reddy, S/o. Kambala Bali Reddy, Hindu, aged about 50 years, Bricks Business, R/at Door No. 4/384, Teachers Colony, Khajipet Village and Mandal, Kadapa District. **...Respondents/J.Dr.**

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా పై నెంబరు ఈ.పీ.లో ఈ క్రింది కనబరిచిన షెడ్యూల్ దాఖలా ఆస్తి వేలం వేయుటకు కోర్టు వారు 19.02.2024వ తేదీన వాయిదా వేసినారు. సదరు పై కోర్టులో 19.02.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు వేలం వేయబడును. సదరు వేలం షరతులకు లోబడి పై కోర్టులో పైన కనబరిచిన తేదీన కొనుగోలుదారులు వేలంలో పాల్గొని పాట పాడుకొనవచ్చునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

SCHEDULE

Land an extent of Ac.0.58 cents Paiki Ac.0.29 cents or 0.117 Hectares situated in circar punji survey No.581/1 if Utukuru Village fields, kadapa Municipal Corporation, Kadapa Rural Sub District, Kadapa District, with all easementary rights, bounded by East: Land of Guthireddy Venkata Krishna Reddy, West: Land of Naganna is schedule survey number, North:Road, South: Land of Anaguru Penchal Reddy.
D.Hr Value of the property is Rs.22,70,552/-.
Ameena Value of the Property is Rs.12,00,000/-.
Note:- E.P.Schedule mentioned property is mortgaged by J.Dr to M/s Shri Ram City Union Finance Limited on 08.06.2011, Mortgage value of the property is Rs.14,00,000/-, Proclamation and sale of E.P.Schedule Property Subjected to mortgage.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

SHAIK ARSHAD
Advocate,
Kadapa City.
Cell No.9490266125.